జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 28 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5

### వర్షాల నేపథ్యంలో అందుబాటులో
# 24 గంటలూ కంట్రోల్ రూమ్

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 27 ,(ప్రజా జ్యోతి )** జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ మరో ఐదు రోజుల పాటు వర్ష హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు, వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఐడీఓసీలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఐడీఓసీలోని జి–19 గదిలో

మిగతా 2 లో...




- దుగినేపల్లి పంచాయతీ
- నిధుల ఖర్చుపై గ్రామస్తుల ఆరోపణలు
- బినామీ పేర్లతో ఎంబీలు చేశారంటూ ఆరోపణలు..
- ఒక్కరి పేరుతోనే రూ.3 లక్షల వరకు?
- కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో రూ.1.50 లక్షల ఖర్చుపై అనుమానాలు
- పంచాయతీ రికార్డులు, బ్యాంకు లావాదేవీలపై సమగ్ర విచారణకు డిమాండ్

### పనులు లేకుండానే..
# రూ.7.76 లక్షల బిల్లులా..!

**పినపాక, సెప్టెంబర్ 27(ప్రజా జ్యోతి):** పినపాక మండలంలోని దుగినేపల్లి గ్రామపంచాయతీలో గత ఐదు నెలల్లో సుమారు రూ.7.76 లక్షల మేర నిధులు ఖర్చు చేసినట్లు నమోదవడంపై గ్రామస్తులు పలు ఆరోపణలు చేస్తున్నారు. రికార్డుల్లో చూపిన ఖర్చుకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులకు పొంతన లేదని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కొమరం సుధాకర్ అనే వ్యక్తి పేరుతోనే గత ఐదు నెలల్లో సుమారు రూ.3 లక్షల వరకు ఎంబీలు, బిల్లులు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే తనకు పంచాయతీ పనులతో సంబంధం లేదని, తాను ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నందున తన ఖాతాలోకి డబ్బులు జమ చేస్తే సంబంధిత వారికి నగదు రూపంలో తిరిగి ఇస్తున్నానని సుధాకర్ చెబుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. దీంతో ఆయన పేరుతో నమోదైన పనులు వాస్తవంగా ఎవరు చేశారనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అదేవిధంగా కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో సుమారు

మిగతా 2 లో...

# కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు చిరస్మరణీయం

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 27,(ప్రజా జ్యోతి)** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని, ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం దీక్ష చేపట్టడంతో పాటు తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకుని ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు.సమాజంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన ఆస్తులను సైతం దానం చేసిన

మిగతా 2 లో...

### 43 అడుగులకు చేరువలో
# గోదావరి వరద

- **భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం**



2 లో...

- **ప్రభుత్వ వైద్యశాలలో విధుల నిర్వహణపై వరుస ఆరోపణలు**

**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 27**

అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలలో అంతర్గత విభేదాలు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా వైద్య సేవలు గాడి తప్పుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యుల మధ్య, వైద్యులు–నర్సుల మధ్య అంతర్గత కుమ్ములాటలు కొనసాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో దాని ప్రభావం రోగులపై పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రిలో

మిగతా 2 లో...




### అంతర్గత కుమ్ములాటలో
# వైద్యంపై నిర్లక్ష్యం!

## కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి...)

త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆయన చూపిన సేవా, త్యాగ మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.విజయలక్ష్మి , వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, బీసీ సంఘ నాయకులు చిప్పా శ్రీనివాస్, ఇమ్మడి ఉదయ్ కుమార్, మోత్కూరి ధర్మారావు, బి సత్యనారాయణ, గమలాపురం సత్యనారాయణ, కొదుమూరు సత్యనారాయణ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అందుబాటులో 24 గంటలూ కంట్రోల్ రూమ్

(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08744-241950 నంబర్‌తో 24×7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధులకు నియమించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారులకు చేరవేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌ను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, సమస్యకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖ అధికారులకు వెంటనే తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలు వర్షాలు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో 08744-241950 కంట్రోల్ రూమ్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.

## పనులు లేకుండానే రూ.7.76 లక్షల బిల్లులా..!





(మొదటి పేజీ తరువాయి...)

రూ.1.50 లక్షల వరకు బిల్లులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే గ్రామంలో జరిగిన విద్యుత్ పనులు, ఏర్పాటు చేసిన సామగ్రితో పోలిస్తే బిల్లుల్లో చూపిన మొత్తంపై స్పష్టత అవసరమని గ్రామస్తులు అంటున్నారు.

**వేర్వేరు పేర్లతో ఎంబీలు.. బిల్లులు?**

మరికొంతమంది వ్యక్తుల పేర్లను ఉపయోగించి ఎంబీలు నమోదు చేసి నిధులు ఖర్చు చేసినట్లు చూపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పనులు వాస్తవంగా జరిగాయా? బిల్లుల్లో చూపిన పరిమాణంలో సామగ్రి సరఫరా జరిగిందా? అనే అంశాలపై గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**సంతకాలు.. బిల్లులు.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

సర్పంచ్, ఉపసర్పంచ్‌ల సంతకాలతో ఎంబీలు, బిల్లులు జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత రికార్డులను పరిశీలించిన అధికారులు ఎవరు? క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేశారా? అనే అంశాలపై గ్రామస్తులు సమాధానం కోరుతున్నారు.

**రికార్డులు బయటపెట్టాలని డిమాండ్**

గత ఐదు నెలల్లో జరిగిన పనులకు సంబంధించిన ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, బ్యాంకు లావాదేవీలు, సరఫరా బిల్లులు, పనుల ఫొటోలు, పంచాయతీ తీర్మానాలను బహిరంగంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



# అంతర్గత కుమ్ములాటలో వైద్యంపై నిర్లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి...)

మౌలిక వసతులు, వైద్య పరికరాలు సమకూర్చినా వాటికి అనుగుణంగా సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొందరు సిబ్బంది విధులకు సమయానికి హాజరు కాకుండా సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 10.30 నుంచి 11 గంటల సమయంలో విధులకు వచ్చి మధ్యాహ్నం 3 గంటలకే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**స్కానింగ్ ఉన్నా... వారానికి ఒక్కరోజే సేవలు**

ఆసుపత్రిలో స్కానింగ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం ఒక్కరోజు మాత్రమే రేడియాలజిస్ట్ అందుబాటులో ఉంటారని పలువురు చెబుతున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో స్కానింగ్ అవసరమైన రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

**బ్లడ్ బ్యాంక్ ఉన్నా... అవసరమైన రక్తం దొరకడంలేదా?**

ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ సదుపాయం ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో అన్ని రకాల రక్తం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అత్యవసర రోగులు, ప్రసవాలు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి.

**సాయంత్రం తర్వాత మందుల పరిస్థితి ఏంటి?**

ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితుల్లో సాయంత్రం 6 గంటల తర్వాత అవసరమైన మందులు అందుబాటులో ఉండటం లేదనే ప్రధాన ఆరోపణ వినిపిస్తోంది. రాత్రివేళ అత్యవసరంగా వచ్చే పేద రోగులు మందుల కోసం బయట ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు

**పరికరాలున్నా... సేవలు ఎక్కడ?**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రికి వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నప్పటికీ సిబ్బంది విధుల నిర్వహణలో లోపాలు ఉంటే వాటి ప్రయోజనం ప్రజలకు చేరదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిబ్బంది హాజరు, విధుల సమయాలు, రేడియాలజీ సేవలు, బ్లడ్ బ్యాంక్ నిర్వహణ, మందుల లభ్యతపై ఉన్న ఆరోపణలను ఉన్నతాధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

## బీసీఆర్ ట్రస్ట్ వైద్య శిబిరానికి పెరుగుతున్న ఆదరణ

- వైద్యానికి కమ్యూనిస్టులు పెద్దపీట
- సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సోమయ్య




**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి):** బండారు చంద్రరావు స్ఫూర్తితో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెలనెలా వైద్య శిబిరానికి ఆదరణ పెరుగుతోందని సీపీఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సోమయ్య అన్నారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కరోనా సమయంలో సీపీఎం ఆధ్వర్యంలో ఐసోలేషన్ కేంద్రాలు నిర్వహించి ప్రజలకు సేవలందించామని తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి మాట్లాడుతూ పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ కమ్యూనిస్టులు ముందుంటారని, ప్రతి నెల చక్కెర, రక్తపోటు బాధితులకు వైద్య సేవలు, మందులు అందించడం అభినందనీయమన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి మాట్లాడుతూ బీసీఆర్ ట్రస్ట్ వైద్య శిబిరానికి వైద్యుల తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. శిబిరంలో రూ.100కే చక్కెర, రక్తపోటు మందులు అందించడం పేదలకు ఎంతో ఉపయోగకరమన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తదితరులు శిబిరాన్ని పరిశీలించి రోగుల వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు పవనక◌ుమార్, నీరజారెడ్డి, తేజస్విని ఉచిత వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యులు, సిబ్బందిని ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ట్రస్ట్ బాధ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో రేపాక సాయి అఖిల్‌కు ప్రత్యేక గుర్తింపు



**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి):** సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజ సేవకు తనవంతు సహకారం అందిస్తున్న రేపాక సాయి అఖిల్ సేవా స్ఫూర్తికి గుర్తింపు లభించింది. భద్రాచలంలోని వాసవి క్లబ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, క్లబ్ అభివృద్ధితో పాటు వివిధ సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్న ఆయనను బండారు వారి సేవా పురస్కారాల కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాల పట్ల ఆయన చూపుతున్న అంకితభావాన్ని గుర్తించిన నిర్వాహకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్న సాయి అఖిల్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు కొనియాడారు. సమాజ సేవలో ఆయన మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## 43 అడుగులకు చేరువలో గోదావరి వరద

**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజా జ్యోతి):** భద్రాచలం వద్ద గోదావరి నదీ ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు 42.5 అడుగులు, 2 గంటలకు 42.7 అడుగులు, 3 గంటలకు 42.8 అడుగుల నీటి మట్టం నమోదైంది. సాయంత్రం 4 గంటలకు 42.9 అడుగులకు చేరి, మొదటి ప్రమాద హెచ్చరిక కు చేరువలో నిలిచింది.గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. ఎగువన ఉన్న ఇంద్రావతి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం నాటికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు గోదావరి నీటిమట్టం నిలకడగానే ఉంది.భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

## బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న (సి ఈసీ) నీ పదవి నుంచి తొలగించాలి

- డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ఎద్దుల ధర్నా



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 27,(ప్రజాజ్యోతి)** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ని వెంటనే పదవి నుండి తొలగించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పాల్వంచ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ బిజెపి పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ఆయనను వెంటనే పదవి నుండి తొలగించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో ఈనెల 28 తేదీన కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమాలు చేపట్టామని , కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకుల రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ. జలీల్, నరహరి, బాలు నాయక్, భట్టు మురళి, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, డాక్టర్ బి.ఎస్. రావు, నూకల సరిత, సీరపు సుగుణ, దంతేబోయిన నరేష్, ధర్మసోత్ నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగూడెం జిల్లాకు 26 పథకాలు








**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 27, (ప్రజా జ్యోతి)**
తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 26 పతకాలు సాధించి జిల్లా పేరు రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు , ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ విజేతల వివరాలను ఇక్కడ వెల్లడించారు, అథ్లెట్స్ చాంపియన్ పోటీలో 12 బంగారు, 8 రజత, 6 కాంస్య పతకాలు ఉన్నాయన్నారు, ఈ సందర్భంగా పతాక విజేతలను అథ్లెటిక్స్ కోచ్ లు పి. నాగేందర్, డి. మల్లికార్జున్ రావు, భద్రాచలం కోచ్ జే. గిరి ప్రసాద్ లను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె. సారంగపాణి, జాతీయ కోచ్ ద్రోణచారి అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, జిల్లా క్రీడలు అధికారి మ్. పరంధామ్ రెడ్డి అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల్లో విజయం సాధించిన అథ్లెట్లు వివరాలు ఈ విధంగా ఉన్నాయి, చర్లకు చెందిన ఎం. శ్రీ విద్యా దొర 100 మీటర్ల హర్డిల్స్ లో బంగారు పతకం, సక్. ముబీన్ షాట్ పుట్ లో ,బంగారు పతకం,కరకగూడెంకు చెందిన తోలేం శ్రీ తేజ 100 మీటర్లు హర్డల్స్ లో బంగారు పతకం సాధించారు. కొత్తగూడెంకు చెందిన సక్. రియాజ్ పాషా షాట్‌పుట్‌లో బంగారు పతకం మరియు డిస్కస్ త్రో లో రజిత పతకం, మధు ప్రియ జావీలిన్ లో బంగారు పతకం, ch. వేదశ్రీ, షాట్ పుట్ లో కాంశ్య పతకం సాధించారు.దుమ్ముగూడెం కు చెందిన సాయి ఆదిత్య 600 మీటర్లు పరుగు పందెం లో బంగారు పతకం,పాల్వంచ కు చెందిన ర్. అభినవ్ నాయక్ హై జంప్ , డెకతలాన్ లో రెండు బంగారం పతకలు, మ్. పవన్, హై జంప్ లో బంగారు పతకం మరియు 400 మీటర్ల ల హర్డల్ లో కాంశ్య పతకం, మ్. దివ్య, లాంగ్ జంప్ లో బంగారు పతకం , 400మీటర్ పరుగు పందెం లో కాంశ్య పథకం స్. అక్షిత, డిస్కస్ త్రో లో బంగారం పథకం , జావీలిన్ లో రజిత పతకం,సిద్ద వినయ్ హై జంప్ లో రజిత పతకం, బి. పల్లవి హై జంప్ లో రజిత పతకం, బి. సౌమ్య, జావీలిన్ త్రో లో కాంశ్య పతకం, భద్రాచలం కు చెందిన ఎస్కే. అమ్రిన్ షాట్ పుట్ లో బంగారు పతకం ,జావెలిన్ త్రో లో రజిత పతకలు సాధించారు. కె. నవ్య, జావీలిన్ త్రో లో రజిత పతకం,బి. పృథ్విక జావెలిన్ త్రో లో కాంశ్య పతకం, అశ్వారావుపేట కు చెందిన స్. గౌరి డిస్కస్ త్రో లో రజిత పతకం, గోవింద్ కుమార్, షాట్ పుట్ లో కాంశ్య పతకం, ఇల్లేందు కు చెందిన బి. హర్షిని హై జంప్ లో రజిత పథకాలను కైవసం చేసుకున్నారు

## 12 ఏళ్ల రోహిత్ వైద్యానికి మరో రూ.5 వేలు చేయూత

- సమాచారం గ్రూప్ సభ్యుల సహకారంతో బాబు వైద్యానికి 45 వేలు తక్షణ సాయం



**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజా జ్యోతి):** ఆదర్శనగర్ కాలనీకి చెందిన రోహిత్ అనే 12 ఏళ్ల బాలుడి అత్యవసర వైద్యానికి సమాచారం గ్రూప్ సభ్యులు మరోసారి తమ చేయూతను అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. శనివారం రాత్రి గ్రూప్ సభ్యుల సహకారంతో రూ.40 వేల ఆర్థిక సాయం అందించిన విషయం తెలిసిందే.కాగా, సమాచారం గ్రూప్ సభ్యులు, జిమ్ రవి, ఐటీసీ టీచర్స్ కాలనీ వాసుల సహకారంతో ఆదివారం ఉదయం మరో రూ.5 వేల ఆర్థిక సాయాన్ని రోహిత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో ఇప్పటివరకు బాలుడి వైద్య ఖర్చుల కోసం సమాచారం గ్రూప్ తరపున మొత్తం రూ. 45 వేల సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రామయ్య సేవలో టీటీడీ పాలక మండలి సభ్యులు అక్కిన ముని కోటేశ్వరరావు



**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి ):** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ ) పాలక మండలి సభ్యులు అక్కిన ముని కోటేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో, సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకుని అంతరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరంఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దేవస్థానం విశేషాలు, పూజా కార్యక్రమాల వివరాలను ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదర్‌రావు, ఏఈవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ





**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజాజ్యోతి ):** భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పిఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆదివారం వారు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాలకు తప్పనిసరిగా హాజరు కావాలని పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ స్పష్టం చేశారు.

## విద్యాసంస్థల నిర్వహణపై ఎంఈఓ పరిశీలన

- విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత తనిఖీ.. మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశం





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 27, (ప్రజాజ్యోతి) :** అన్నపురెడ్డిపల్లి మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూను సక్రమంగా పాటించకపోవడం తన దృష్టికి వచ్చిందని, ఇకపై తప్పనిసరిగా నిర్ణయించిన మెనూను పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమమే విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు.

## నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ

**పినపాక, సెప్టెంబర్ 27(ప్రజాజ్యోతి )** పినపాక నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పినపాకలోని జి.వి.ఆర్. (GVR) ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ శిక్షణకు పినపాక, కరకగూడెం, అశ్వాపురం, మణుగూరు మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది హాజరుకావాల్సి ఉంటుంది.

### ›› గ్రామాల సమగ్ర అభివృద్ధిపై అవగాహన

గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ఉద్దేశించిన వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక (Viksit Gram Panchayat Plan)పై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టే విధానంపై అవగాహన కల్పించనున్నారు.అదేవిధంగా ఉపాధి హామీ పథకం సంస్కరణలు, మార్గదర్శకాలు, పథకం పేరు మార్పు అంశాలపై కూడా సంబంధిత అధికారులు, సిబ్బందికి వివరించనున్నారు. నాలుగు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణీత సమయానికి తప్పక హాజరై శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పాల్వంచలో యువకుడిపై దాడి కేసు నమోదు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 27 ,(ప్రజా జ్యోతి )** వినాయక నిమజ్జన ఊరేగింపులో పాత కక్షలతో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన పాల్వంచలోని గాంధీనగర్ లో జరిగింది. బాధితుడు గడ్డం సాయిరాం కథనం ప్రకారం... ఈ నెల 26న రాత్రి తమ కాలనీలో విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్లగా, పాత కక్షలతో కొల్లిపాక అరుణ్, అతని స్నేహితులు హరి మాధవ్, భూక్య పవన్ అతడిపై దాడికి దిగారు. అరుణ్ చేతి కడియంతో కొట్టడంతో సాయిరాం ఎడమ కన్నుపై తీవ్రంగా గాయమైంది, అడ్డువచ్చిన తల్లిదండ్రులను పక్కకునెట్టి స్థానికులు వారించగా కత్తులతో బెదిరించి పరారయ్యారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# అక్టోబర్ 5 ధర్నాను జయప్రదం చెయ్యండి

- గిరిజన సంఘాల జేఏసీ
- మహాధర్నను జయప్రదం చేయాలని కోరుతూ గిరిజన సంఘాల సన్నాహక సమావేశం



**గుండాల సెప్టెంబర్ 27 ప్రజా జ్యోతి** అక్టోబర్ 5న కొత్తగూడెం కలెక్టరేట్ ముందు జరుగు ద్ద మహా దన్నను జయప్రదం చేయాలని కోరుతూ గిరిజన సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం గుండాల మండల కేంద్రంలోని పగిడిద్దరాజు వద్ద ఆ సంఘం నాయకులు సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పెల్లి కట్ల మహేందర్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జేఏసీ సంఘాల నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఆదివాసి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని అమలు పరచాలని, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, గిరిజనులపై జరుగుతున్న అన్యాలను అరికట్టాలని, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడుల పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరుతూ ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల జేఏసీ చైర్మన్ పూణెం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివాసుల భద్రతపై, ఆదివాసుల హక్కులపై జరుగుతున్న ఘటనలపై ఆదివాసులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వివిధ సమస్యలపై అక్టోబర్ 5న జరిగే కొట్టడం కలెక్టరేట్ మహాధర్నను జయప్రదం చేయాలని, ఆదివాసి బిడ్డలంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనప విష్ణు, ముక్తి సత్యం, ఓకే నాగన్న, కల్తీ కృష్ణారావు, కోరం సీతారాములు, కల్తీ రామ్మూర్తి, వజ్జా ఎర్రయ్య, కల్తీ లక్ష్మణ్, అరెమ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గౌతమీ తీరాన వైభవంగా నదీహారతి

- పితృపక్షాల తొలిరోజు గోదావరి మాతకు ప్రత్యేక పూజలు



**భద్రాచలం, సెప్టెంబర్ 27 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం గోదావరి తీరంలో ఆదివారం సాయంత్రం నదీహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భాద్రపద బహుళ పాడ్యమి, మహాలయ పితృపక్షాల తొలిరోజు కావడంతో గోదావరి మాతతో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి, పితృదేవతలకు ప్రత్యేక హారతులు సమర్పించారు.భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించి భక్తులతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేయించారు. అనంతరం నదీహారతి సమర్పించి లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేశారు. గోదావరి వరదలు తగ్గి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని గోదావరి మాతను ప్రార్థించినట్లు రవికుమార్ తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న నదీహారతి కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించి రామవజ్జల రవికుమార్ దంపతులు, సత్యనారాయణ రెడ్డి దంపతులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. నదీహారతికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాద్రి పురోహితుల సంఘం సమకూర్చింది.కార్యక్రమంలో పురోహితులు ఉమామహేశ్వర ఆచార్య, రామాచార్యులు, సత్య ప్రసాద్ శర్మ, తేజ శర్మ, తిరుపతిరావు, సత్యనారాయణరెడ్డి, శివ, చంద్రశేఖర్ శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా.. సేవా భారతి

- కరోనా కాలం నుంచి నేటి వరకు నిరంతర సేవలు
- 550 మందికి సేవా భారతి అంబులెన్స్ సేవలు






**చర్ల, సెప్టెంబర్ 27(ప్రజా జ్యోతి ):** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంతో పాటు పేద, నిరుపేదలు, మారుమూల గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో సహాయం అందించాలనే లక్ష్యంతో చర్ల మండలంలో సేవా భారతి స్వచ్ఛంద సంస్థ నిరంతర సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో ప్రారంభమైన సేవలను నేటికీ విస్తరిస్తూ అనేక కుటుంబాలకు సంస్థ అండగా నిలుస్తోంది.కరోనా సమయంలో బాధితులకు పీపీఈ కిట్లు, ఆహార పదార్థాలు, మందులు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయాన్ని అందించింది. కరోనా కారణంగా మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు ముందుకు రాలేని పరిస్థితుల్లో మానవతా దృక్పథంతో వారి అంత్యక్రియలను సైతం స్వయంగా నిర్వహించి సేవా భారతి తన మానవత్వాన్ని చాటుకుంది.కరోనా అనంతరం కూడా సేవలను కొనసాగిస్తూ శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన సమయంలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను బాధితుల ఇళ్లకు వాటిని చేరవేసి వారు కోలుకునే వరకు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది.

### »» 550 మందికి పైగా అంబులెన్స్ సేవలు

2019లో వోలం జనార్ధన్, నీలిమ ఆకాష్ చారిటబుల్ ట్రస్టు తరఫున వోలం బుచ్చిలింగం చేతుల మీదుగా చర్లలోని సేవా భారతికి అంబులెన్స్‌ను వితరణగా అందించారు. అప్పటి నుంచి అంబులెన్స్ సేవలను నిరంతరంగా కొనసాగిస్తూ అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఆసుపత్రులకు తరలిస్తోంది.ఇప్పటివరకు సుమారు 550 మందికి పైగా అంబులెన్స్ సేవలు అందించగా, వారిలో సుమారు 150 మంది గర్భిణీలు ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాముకాటు, రోడ్డు ప్రమాదాలు, పాయిజన్ , గుండె సం బంధిత సమస్యలు, ప్లేట్లెట్లు పడిపోవడం తదితర అత్యవసర కేసుల్లో సమాచారం అందిన వెంటనే అంబులెన్స్ ద్వారా బాధితులను భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలిస్తూ ఆపదలో ఉన్న వారి కి అంబులెన్స్ సేవల ద్వారా సేవా భారతి వారిని ఆదుకుంటుంది అని సేవా భారతి సంస్థ ప్రతినిధులు తెలిపారు.ప్రభుత్వ అంబులెన్స్ సౌకర్యం సకాలం లో అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో సేవా భారతి అంబులెన్స్ ఎంతో ఉపయోగకరంగా మారుతోం ది అని ముఖ్యంగా రాత్రి వేళల్లో, అత్యవసర పరిస్థితుల్లో రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న పేద కు టుంబాలకు ఈ సేవ ఒక భరోసాగా ని లుస్తోంది అని తక్కువ నిర్వహణ ఖర్చు తో అత్యవసర వైద్య రవాణా సేవలను అందిస్తూ అనేక కుటుంబాలకు అండగా నిలుస్తోంది అని మండల ప్రజలు సేవా భారతి సేవలను కొనియాడుతున్నారు. ఆపద సమయంలో బాధితులకు సాయం చేయడం, అంబులెన్స్ సౌకర్యం కల్పించటం వంటి కార్యక్రమాలను సేవా భారతి నిరంతరం కొనసాగించడం పట్ల మండల ప్రజలు అభినందిస్తున్నారు. సంస్థ సేవలు మరింత విస్తరించి మారుమూల ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.సంసప్రతినిధులు మాట్లాడుతూ సేవా భారతి సేవలు నిరంతరం కొనసాగిస్తూ ఉంటామని ఆపదలో ఉన్న వారికి అంబులెన్స్ సేవలతో పా టు తమ వంతు సాయం అందించేందుకు ముందుకు ఉంటామని ఎవరికైనా సేవా భారతి సేవలు కావలసినవా రు క్రింది నెంబర్లకు సంప్రదించవచ్చని తెలియజేశారు.సేవా భారతి అంబులెన్స్ ఫోన్ నంబర్లు: 8374166814, 7893808101

# అర్హత లేకుండానే వైద్యం.? వైద్య నారాయణ హరి

- ఏజెన్సీ ప్రాంతాల్లో వీరుచెప్పిందే వేదం.. వీరు చేసేదే వైద్యం అన్నట్లుగా పరిస్థితి!

**అశ్వారావుపేట సెప్టెంబర్ 27 ప్రజా జ్యోతి:** మండలంలో పెట్రేగిపోతున్న ఆర్ఎంపీ–పీఎంపీల వ్యవహారం అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణలోనే వైద్యం అందాల్సిన ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలపై అవగాహన తక్కువగా ఉండే ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు అనధికారికంగా వైద్య సేవలు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.కొంతమంది మెడికల్ షాపులతో పాటు వైద్య సేవలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అర్హతలు, అనుమతులు, వైద్య పద్ధతులు, మందుల వినియోగంపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### »» యాంటీబయాటిక్స్ వినియోగంపై విమర్శలు

అర్హత లేని వ్యక్తులు యాంటీబయాటిక్స్, ఇంజెక్షన్లు తదితర మందులు వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యాంటీబయాటిక్స్ ను వైద్యుల సూచన లేకుండా వినియోగించడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### »» ఆర్ఎంపీలకు యాంటీబయోటిక్ ఇచ్చే అర్హత ఉందా?

ఆర్ఎంపీ డాక్టర్ అనే వ్యక్తికి ఫస్ట్ ఎయిడ్ కి సంబంధించి టీటీ ఇంజక్షన్ చేసే అర్హత కూడా లేదు అని ఆరోగ్య వైద్య నిపుణులు అంటున్నారు అలాంటప్పుడు టైఫాయిడ్ అనే ఒక రకమై జ్వరానికి కావాలని కొన్ని ల్యాబ్స్ కి టెస్టులు పంపించి టెస్టులు చేయించి 1:160 మరియు 1:160 అని చూపిస్తూ పేషంట్లను భయభ్రాంతులకు గురిచేస్తూ కోర్స్ అనే పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఐదు నుంచి పదివేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి .

### »» సంఘం పేరుతో అండగా నిలుస్తున్నారా?


ఇదిలా ఉండగా, కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు కలిసి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వంటి పదవులతో ఒక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారనే ప్రచారం స్థానికంగా ఉంది. తమకు ఏ సమస్య వచ్చినా ఈ గ్రూపు అండగా ఉంటుందని కొందరు చెప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆ గ్రూపు వాస్తవంగా ఏ విధంగా పనిచేస్తోంది? దానికి అధికారిక గుర్తింపు ఉందా? సభ్యులకు ఉన్న అర్హతలు ఏమిటి? అన్న అంశాలను సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### »» "ఎవరికి ఇవ్వాల్సింది వారికి ఇస్తున్నాం"..?

కొంతమంది వ్యక్తులు కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ముడుపులు ఇస్తున్నామని చెప్పుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అవి అత్యంత తీవ్రమైన విషయం. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### »» సామాన్యుల ఆరోగ్యంతో చెలగాటమా?

గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాల కొరతను ఆసరాగా చేసుకుని అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తే చివరకు నష్టపోయేది సామాన్య ప్రజలేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్ఎంపీ /పీఎంపీ పేరుతో వైద్యం చేస్తున్న ప్రతి వ్యక్తి విద్యార్హతలు, రిజిస్ట్రేషన్, అనుమతులు, నిర్వహిస్తున్న క్లినిక్‌ల చట్టబద్ధత, మెడికల్ షాపుల లైసెన్సులు, మందుల విక్రయ విధానాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిన అంశం **రేపటి ప్రజా జ్యోతి శీర్షిక లో మరిన్ని ఆధారాలతో మీ ముందుకు**



**ఒక కొడుకుకు తండ్రి ప్రపంచం అయితే, ఒక తండ్రికి కొడుకే ప్రపంచం. అలాంటి ప్రపంచమే కళ్ల ముందు కూలిపోతే ఆ తండ్రి గుండె పడే వేదనకు అక్షరాలు సరిపోవు. మణుగూరులో ప్రముఖ వ్యాపారవేత్తగా ఎంతో మందికి ఉపాధి చూపిన నాసిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి జీవితం లోనూ అదే జరిగింది. తనకు ప్రాణంగా భావించే పెద్ద కొడుకు వినయ్ కుమార్ రెడ్డిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు లాక్కెళ్లింది. కొడుకు లేని ఆ ఇంట్లో ఇప్పుడు అతని జ్ఞాపకాలు తప్ప ఏమీ మిగల్లేదు. కానీ ఆ జ్ఞాపకాలను గుండెల్లోనే దాచుకోకుండా, తన ఊరి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలపాలని ఆ తండ్రి నిర్ణయించుకున్నాడు. కొడుకు పేరు చెబితేనే పది మంది పేదలకు సాయం అందాలని, వినయ్ ఎక్కడున్నా ఆత్మ శాంతించాలని ఆ తండ్రి చేస్తున్న సేవా యజ్ఞమే తన ఊరికి సంకల్పం.**

- నా కొడుకే నా ప్రాణం..! వాడి జ్ఞాపకమే నా ఊరికి సేవ...
- కొడుకును మృత్యువు దూరం చేసినా.. తండ్రి ప్రేమను దూరం చేయలేక పోయింది...
- కొడుకు పేరును చిర స్మరణీయంగా నిలిపిన తండ్రి హృదయం...
- కొడుకు ఇక లేడు.. కానీ వినయ్ పేరుతో ఎన్నో కుటుంబాలకు అండగా...
- కొడుకు లేడని తండ్రి కన్నీళ్లలోంచి పుట్టిన సేవే మహా యజ్ఞం...
- మృత్యువు గెలిచింది.. కానీ తండ్రి ప్రేమ ముందు ఓడిపోయింది...

# తండ్రి గుండెల్లో చెరగని

# వినయ్ రెడ్డి జ్ఞాపకం






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి

ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న పెద్ద కొడుకు వినయ్ కుమార్ రెడ్డి తన కళ్ల ముందే పెరిగి పెద్దవాడై తనకు చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్నాడు ఆ తండ్రి. కానీ విధి ఆ తండ్రిని వక్రించింది. ఒక రోడ్డు ప్రమాదం ఆ తండ్రి కలలన్నీ కూల్చేసింది. కన్న కొడుకు వినయ్ లేడనే నిజాన్ని జీర్ణించుకోలేక ఆ కుటుంబం రోజూ కన్నీరు మున్నీరవుతోంది. అయితే ఆ కన్నీళ్లలోనే ఒక మంచి ఆలోచన ఆ తండ్రికి పుట్టింది. తన కొడుకు చనిపోయినా, తన కొడుకు పేరు మాత్రం తన ఊరిలో ఎప్పటికీ బతికి ఉండాలని ఆ తండ్రి నాసిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి సంకల్పించారు. తాను పుట్టి పెరిగిన మంగపేట మండల ప్రజలకు ఏదైనా చేయాలని, అది కూడా తన కొడుకు పేరు మీదుగా చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే మండలంలో ఎక్కడా లేని విధంగా, పేద ప్రజల కోసం ఉచిత శీతల శవపేటిక (ఫ్రీజర్ బాక్స్) ను విరాళంగా ఇచ్చారు. ఒక మనిషి చనిపోతే ఆ కుటుంబం పడే బాధ తనకు తెలుసు కాబట్టి, తన లాంటి బాధ మరెవరికీ రాకూడదనే చిన్న సాయం అందించాడు. ఇది కేవలం విరాళం కాదు, ఒక తండ్రి తన కొడుకుపై చూపిస్తున్న ప్రేమకు నిదర్శనం అని నిరూపించారు.

**కొడుకును మృత్యువు దూరం చేసినా.. తండ్రి ప్రేమను దూరం చేయలేకపోయింది...**

కొడుకు భుజం మీద చేయి వేసి నడవాలనుకున్న తండ్రికి, ఆ కొడుకు చితికి నిప్పు పెట్టే దుస్థితి వస్తే ఆ బాధ వర్ణనాతీతం. విజయ్ భాస్కర్ రెడ్డి పరిస్థితి అదే. తన కళ్ల ముందే ఎదిగిన వినయ్ రెడ్డి, ఒక్క క్షణంలో విగతజీవిగా మారడం ఆ తండ్రి గుండెను ముక్కలు చేసింది. కానీ ఆ తండ్రి భాస్కర్ రెడ్డి కృంగిపోలేదు. 'తన కొడుకు శరీరం మాత్రమే పోయింది, వాడి పేరు తన ఊర్లో ప్రతి ఇంట్లో వినిపించాలి' అని శపథం చేశాడు. ఆ కన్నీటి శపథం నుంచే పుట్టింది ఈ ఉచిత సేవ. ఎవరి ఇంట్లో విషాదం జరిగినా, ఆ కుటుంబానికి వినయ్ పేరుతో ఓదార్పుగా నిలవడమే ఆ తండ్రి లక్ష్యం.

**కొడుకు లేడని తండ్రి కన్నీళ్లలోంచి పుట్టిన సేవే మహా యజ్ఞం...**

ఆ ఇంట్లో ఇప్పుడు నవ్వులు లేవు, వినయ్ అనే పిలుపు లేదు. ఉన్నదల్లా గోడకు వేలాడే ఒక నవ్వుతున్న ఫోటో మాత్రమే. ఆ ఫోటోను చూస్తూనే కన్నీరు పెట్టుకునే తండ్రి వేదన తన హృదయాన్ని గాయం చేసింది. విజయ్ భాస్కర్ రెడ్డికి కొడుకు లేడనే లోటు ఎవరూ తీర్చలేనిది. ఆ లోటును తలచుకుని కార్చిన ప్రతి కన్నీటి బొట్టులోంచి ఒక మంచి ఆలోచన పుట్టింది. తనకు జరిగిన నష్టం మరెవరికీ జరగకూడదని, తన కొడుకు లేని లోటు తన ఊరి సేవతో తీర్చుకోవాలని ఓ యజ్ఞంలా పెట్టుకున్నాడు. అందుకే తన సొంత ఖర్చుతో మంగపేట మండల ప్రజల కోసం ఉచిత శవపేటిక, పలు సంస్థలకు వితరణ, పేద కుటుంబాలకు సహాయ, సహకారాలు అందజేస్తున్నారు. ఇది దానం కాదు, తండ్రి తన కొడుకు ఆత్మశాంతి కోసం చేస్తున్న కన్నీటి మహా యజ్ఞం.

**కొడుకు పేరును చిరస్మరణీయంగా నిలిపిన తండ్రి హృదయం...**

సాధారణంగా తండ్రి తన ఆస్తిని కొడుక్కి ఇస్తాడు. కానీ ఇక్కడ ఒక తండ్రి తన కొడుకు పేరుకే ఆస్తిగా మారేలా చేశాడు. అదే విజయ్ భాస్కర్ రెడ్డి గారి గొప్ప హృదయం. పెద్దకుమారుడు వినయ్ కుమార్ రెడ్డి అకాల మరణం ఆయనను కుంగదీసినా, ఆ బాధలోనే ఒక ఉన్నతమైన ఆలోచన చేశారు. తన కొడుకు పేరు కేవలం తన ఇంటికే పరిమితం కాకూడదని, తాను పుట్టిన మంగపేట మండల ప్రజల నోట్లో ఎప్పటికీ నానాలని ఆకాంక్షించారు. అందుకే పేదల అవసరాల కోసం ఉచిత ఫ్రీజర్ బాక్స్, దాన ధర్మాలు, వినయ్ పేరు మీద విరాళంగా ఇచ్చి, తండ్రిగా తన ప్రేమను, ఒక మనిషిగా తన మానవత్వాన్ని చాటుకున్నారు.





